సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 5 । సెప్టెంబర్ । 2022

'సన్'దర్శకులకు కనువిందు

సాక్షి, పాడేరు : వంజంగి హిల్స్‌పై ఆదివారం ప్రకృతి అందాలు కనువిందు చేశాయి. పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు శనివారం రాత్రే వంజంగి హిల్స్‌కు చేరుకుని కల్లాలబయలు, బోనంగమ్మ పర్వతంపై గుడారాలు వేసుకుని బస చేశారు. తెల్లవారుజామున 5.30గంటల సమయంలో సూర్యోదయం అందాలను తిలకించారు. బోనంగమ్మ పర్వతంతో పాటు కిందవైపు ఉన్న కొండల 'స్నో'యగాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. ఉదయం 9గంటల వరకు మంచు అందాలతో వంజంగి హిల్స్ ప్రాంతం దర్శనమిచ్చింది.



న్యూస్‌రీల్

ఇద్దరు సీఆర్టీలకు షోకాజ్ నోటీసులు

పెదబయలు: మండలంలోని మారుమూల జామిగుడ పంచాయతీ పినరావెలి, కొజ్జరిగుడ జీపీఎస్ పాఠశాలల సీఆర్టీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు ఏటీడబ్ల్యూవో కె.స్వర్ణలత తెలిపారు. జామిగుడ పంచాయతీలో పలు పాఠశాలలను శనివారం తనిఖీ చేసినట్టు చెప్పారు. కొజ్జరిగుడ, పినరావెల సీఆర్టీలు కె.మన్మధరావు, కె.భారతిలు వారానికి రెండు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని, దీంతో షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. ఆ సీఆర్టీల జీతాలు నిలుపుదల చేయాలని ఆయా స్కూల్ కాంప్లెక్స్‌ల హెచ్‌ఎంలను ఆదేశించినట్టు తెలిపారు. ఉపాధ్యాయులందరూ సక్రమంగా విధులకు హాజరు కావాలని ఆమె ఆదేశించారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో పెద్దూరు విద్యార్థికి బంగారు పతకం



షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం సాధించిన కమిడి సూర్య

అనంతగిరి: మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన కమిడి సూర్య అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. యూత్ గేమ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గతనెల 26 నుంచి 30 వరకు నేపాల్‌లోని పోరకలో నిర్వహించిన సెకెండ్ యూత్ ఇండోనేపాల్ అంతర్జాతీయ–2022 సిరీస్‌లో అండర్ -14 విభాగంలోని పాల్గొని బంగారు పతకం సాధించాడు. అరకువేలి క్రీడా పాఠశాలలో సూర్య 7వ తరగతి చదువుతున్నాడు. సూర్యను ప్రిన్సిపాల్ రామ్మూర్తి, కోచ్ రాజబాబు అభినందించారు. సూర్యను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి విద్యార్థి తండ్రి కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కామయ్యపేటలో జ్వరాలు



జ్వర పీడితులకు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

హుకుంపేట: మండలంలోని కామయ్యపేటలో 25 మంది గిరిజనులు జ్వరాల బారిన పడి మంచం పట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాతావరణంలో మార్పులు రావడంతో వ్యాధులు ప్రబలాయి. జలుబు,జ్వరం,తలనొప్పి,ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. వైద్య సిబ్బంది ఆదివారం గ్రామంలో శిబిరం నిర్వహించి, చికిత్స చేశారు. చాలా మందికి వైరల్ జ్వరాలు ఉన్నట్టు ఎంఎల్‌హెచ్‌పీ నౌనిక తెలిపారు. ఎక్కువ మంది చిన్నారులు జ్వరాలతో బాధపడుతున్నట్టు చెప్పారు.

ఫీడర్.. అదుర్స్

జిల్లాలో ఎక్కువ ప్రాంతం **దట్టమైన అడవి,** ఎత్తైన కొండలు, గుట్టల**తో నిండి ఉంటుంది.** శిఖర గ్రామాలకు రోడ్డు **వేసే అవకాశం** కూడా లేదు. **బురదమయమైన** నడక దారిలోనే రాకపోక**లు సాగించాలి.** ఆ ప్రాంతాలకు 108 వా**హనాలు వెళ్లే పరి**స్థితిలేదు. గ్రామాల్లో ఎ**వరైనా వ్యాధు**లబారిన పడినా, గర్భిణు**లకు ప్రసవ** సమయం దగ్గర పడినా **అత్యవసర పరిస్థి**తుల్లో వారిని డోలీలో **ఆస్పత్రికి తరలించా**లి. అటువంటి గ్రామాల**కు ఫీడర్ అంబు**లెన్సులు వరంగా మారా**యి. జిల్లాలో** ఫీడర్ అంబులెన్సులు వి**శేషసేవలందిస్తుం**డడంతో ఈ ఐదేళ్లలో **పలువురి ప్రాణాలు** నిలిచాయి.

- గిరిజనులకు వైద్య సేవల్లో కీలకపాత్ర
- 108 వాహనాలు వెళ్ల లేని గ్రామాల్లో విస్తృతంగా సేవలు

అనంతగిరి: ఏజెన్సీలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషిచేస్తోంది. గ్రామీణులు అనారోగ్యానికి గురైతే 108 వాహనాలు నేరుగా వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నాయి. జిల్లాలో చాలా గ్రామాలకు 108 వాహనాలు వెళ్లే పరిస్థితిలేదు. అలాంటి గ్రామాల్లో ఫీడర్ అంబులెన్స్‌ల ద్వారా ప్రభుత్వం వైద్యసేవలందిస్తోంది. దీంతో చాలా గ్రామాల ప్రజలకు డోలీలతో రోగులను ఆస్పత్రులకు మోసుకెళ్లవలసిన అవస్థలు తప్పాయి. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 42 అంబులెన్స్‌లు, మూడు బ్యాకప్ వాహనాలు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో 34 అంబులెన్స్‌లు ఉన్నాయి.

సంవత్సరాల వారీగా ఆస్పత్రులకు తరలించిన కేసులు	
2018–19	25,641
2020–21	30,127
2021–22	44,217

ఐటీడీఏల పరిధిలో ఫీడర్ అంబులెన్సుల వివరాలు		
పాడేరు	:	42+ 3 బ్యాకప్ వాహనాలు
రంపచోడవరం	:	24
చింతూరు	:	10

ప్రతి నెలా 3500 మందికి వైద్యసేవలు

మూడు ఐటీడీఏల పరిధిలో ఈ అంబులెన్సుల ద్వారా ప్రతి నెలా సుమారు 3500 మందికి సేవలందిస్తున్నారు. 2018లోని ఏప్రిల్‌లో ఫీడర్ అంబులెన్స్ సేవలు ప్రారంభమయ్యాయి. ప్రారంభమైన ఏడాదే వీటి ద్వారా పాడేరు ఐటీడీఏ పరిధిలో 25,641 మందిని ఆస్పత్రులకు తరలించారు. ఉత్తమ సేవలకు గాను ఆ ఏడాది స్కోచ్ అవార్డు లభించింది. 2020–21లో 30,127 **మంది రోగులు, గర్భిణులను ఆస్పత్రులకు తరలించారు. 2021–22లో ఇప్పటి వరకు 44,217 మందిని తరలించారు. ప్రతి నెలా 600 మంది గర్భిణులు ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. ఫీడర్ అంబులెన్స్‌లు ఎక్కడైనా మరమ్మతులకు గురైతే వాటి స్థానంలోని బ్యాకప్** వాహనాలు ద్వారా సేవలందిస్తారు. ఫీడర్ అంబులెన్స్‌లను బాగుచేయించే వరకు బ్యాకప్ వాహనాలను ఉపయోగిస్తారు.



గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

సేవలను మరింతగా వినియోగించుకోవాలి



మన్యంలోని మారుమూల గ్రామాలకు సైతం వైద్యసేవలను అందించాలనే ప్రధాన లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఫీడర్ అంబులెన్స్ సేవలను గర్భిణులు, రోగులు మరింతగా వినియోగించుకోవాలి.

– లీలాప్రసాద్, ఏడీఎంహెచ్‌వో, పాడేరు

50 రోజులుగా బ్యాంకులు బంద్

- ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు
- కాలయాపన చేస్తున్న అధికారులు





కూనవరం మండలం టేకులబోరు, చింతూరులో మూసిఉన్న బ్యాంకులు

చింతూరు: విలీన మండలాలైన చింతూరు, కూనవరాల్లో పలు బ్యాంకులు మూతపడి ఉండడంతో రైతులు, వ్యాపారులు, పెన్షనర్లు, ఇతర ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలో వచ్చిన గోదావరి, శబరి నదుల వరదలకు చింతూరులో ఎస్‌బీఐ, కూనవరం మండలం టేకులబోరులో ఎస్‌బీఐ, ఏపీజీవీబీ బ్యాంకులు ముంపునకు గురయ్యాయి. 10 రోజులకు పైగా ఆయా బ్యాంకులు వరదనీటిలో ఉండడంతో బ్యాంకుల్లోని సామగ్రి మొత్తం పాడైంది. వరద ప్రభావం తగ్గి చింతూరు, కూనవరం మండలాల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నా ఇప్పటికీ బ్యాంకుల కార్యకలాపాలు ప్రారంభించలేదు. చింతూరు మండలంలో 90, కూనవరం మండలంలో 60 గ్రామాలకు చెందిన ప్రజలు ఈ బ్యాంకులపై ఆధారపడి ఉన్నారు. ఈ రెండు మండలాల్లోని మూడు బ్యాంకుల్లో 80 వేల ఖాతాలున్నాయి.

కూనవరం మండలం టేకులబోరులోని ఎస్‌బీఐ బ్రాంచ్‌కు సంబంధించి ప్రత్యామ్నాయంగా పక్కనే ఉన్న వీఆర్‌పురం మండలం రేఖపల్లి బ్రాంచ్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కాగా రెండు మండలాలకు సంబంధించిన బ్యాంకుల కార్యకలాపాలను ఒకేచోట నిర్వహిస్తుండడంతో రద్దీగా ఎక్కువ ఉండి, ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. వరదలు తగ్గి చాలా రోజులు అవుతున్నా బ్యాంకులను తెరిచేందుకు అధికారులు కాలయాపన చేస్తున్నారని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద తగ్గిన అనంతరం నారుమళ్లు వేసిన రైతులకు వ్యవసాయ రుణాలు, గోల్డ్ లోన్లు, ఇతర రుణాలు అవసరం. వీరితో పాటు వ్యాపారులు కూడా బ్యాంకులపై అధికంగా ఆధారపడి కార్యకలాపాలు నిర్వహిస్తారు. బ్యాంకులు మూసిఉండడంతో వీరు ఇబ్బందులకు గురవుతున్నారు. చింతూరులో ఎస్‌బీఐ మూతపడి ఉండడంతో మండలంలోని వందమందికి పైగా రిటైర్డ్ ఉద్యోగులకు ఈనెల పింఛను అందలేదు.

ప్రైవేటు కేంద్రాలే ఆధారం

బ్యాంకులు మూతపడి ఉండడంతో ఖాతాదారులు నగదు కోసం ప్రైవేటు కేంద్రాలపై ఆధారపడుతున్నారు. తమ అవసరాలను ఆసరాగా చేసుకున్న ప్రైవేటు కేంద్రాల నిర్వాహకులు తమ వద్దనుంచి రూ. వెయ్యికి రూ.10 నుంచి రూ.20 కమీషన్ తీసుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు.

నగదు లేక ఇబ్బందులు



వ్యవసాయ పెట్టుబడులకు నగదు అవసరమై చింతూరులోని ఎస్‌బీఐ బ్యాంకుకు వెళితే మూసి ఉంటోంది. దీంతో ఇబ్బందులకు పడుతున్నాం. కమీషన్ ఇచ్చి ప్రైవేటు కేంద్రాల వద్ద తీసుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి బ్యాంకు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– ముచ్చిక నాగార్జున, కుమ్మూరు సర్పంచ్, చింతూరు మండలం

పింఛను తీసుకోలేదు



ప్రతినెలా చింతూరులోని ఎస్‌బీఐలో పింఛను తీసుకుంటాను. గతనెల వరదలు వచ్చిన నాటి నుంచి బ్యాంకు తెరవక పోవడంతో ఈనెల ఇంతవరకు పింఛను నగదు తీసుకోలేదు. చింతూరు మండలంలో వందమంది రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి ఇలాగే ఉంది.

–జి.బి.రామారావు, రిటైర్డ్ ఎఫ్ఎస్‌వో, చింతూరు

వేరే ప్రాంతానికి మార్చేందుకు చర్యలు

చింతూరులోని ఎస్‌బీఐ కార్యాలయం తరచూ వరదముంపునకు గురవుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో బ్యాంకును ముంపునకు గురికాని ప్రాంతానికి మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వరదముంపునకు గురైన బ్రాంచ్‌లకు సంబంధించి ఇన్సూరెన్సు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రక్రియ పూర్తికాగానే బ్యాంకులు ప్రారంభించి సేవలు అందిస్తాం.

– సురేష్‌బాబు, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్

పులి సంచారంపై అటవీశాఖ అధికారుల ఆరా



అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న అటవీశాఖ అధికారులు

అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

అనంతగిరి: మండలంలోని రొంపల్లి పంచాయతీ పెదరాభ గ్రామంలో పులి సంచరించిన ప్రదేశాలను ఆదివారం అటవీశాఖ అధికారులు పరిశీలించారు. ఏయే ప్రదేశాల్లో సంచరించింది తదితర వివరాలపై ఆరా తీశారు. పెదరాభ గ్రామానికి చెందిన గొల్లన్నదొర అనే గిరిజనుడికి చెందిన ఆవుపై శనివారం పులి దాడి చేసిన విషయం తెలిసిందే. పశువుల కాపరులు పెద్దగా కేకలు వేయడంతో ఆవును విడిచిపెట్టి అటవీప్రాంతంవైపు పులి పరుగు తీసింది. ఆ గ్రామానికి విజయనగరం ఫారెస్ట్ డీఆర్‌వో ప్రహ్లాద్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి కె.వి.ఎస్.రాజు, సిబ్బంది వెళ్లి పరిశీలించారు. కొత్తపనసపాడు గ్రామం వైపు పులి వెళ్లిందని స్థానికులు అటవీశాఖ అధికారులకు తెలిపారు. పెదరాభ, చినరాభ, పసిని, రొంపల్లి గ్రామాల్లో గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయంలో బయట తిరగవద్దని, కొండ ప్రాంతాల వైపుగా ఒంటరిగా వెళ్లవద్దని అధికారులు సూచించారు. పులి సంచరిస్తే తమకు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. పులిదాడిలో గాయపడిన ఆవుకు వెటర్నరీ అసిస్టెంట్ వైద్యసేవలందించారు. ఫారెస్ట్ సిబ్బంది బి.టి. అధికారి గణేష్, ఏవోబీ స్వామి తదితరులు పాల్గొన్నారు.



పులిదాడిలో గాయపడిన ఆవుకు చికిత్స చేస్తున్న పశువైద్య సిబ్బంది

అప్పన్న సన్నిధిలో పార్లమెంటరీ కమిటీ

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహ స్వామిని ఆదివారం లేబర్, టెక్స్‌టైల్స్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ పార్లమెంటరీ కమిటీ దర్శించుకుంది. కమిటీ చైర్మన్ భర్తృహరి మహతాబ్‌తో పాటు సభ్యులు కున్వర్ పుష్పేందర్ సింగ్ చందేల్, పల్లబ్ లోచన్‌దాస్, సతీష్‌కుమార్ గౌతమ్, నాయబ్‌సింగ్ సైనీ, వివేక్ ఠాకూర్ స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. వీరికి ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వీరంతా ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. వీరి పేరిట అర్చకులు స్వామికి పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో హారతులు, అనంతరం వేద ఆశీర్వచనాన్ని అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని ఏఈవో ఆనందకుమార్ వీరికి అందజేశారు.



సింహగిరిపై పార్లమెంటరీ కమిటీ

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు పంచాయతీ తోటకూరపాలెంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సుంకర జ్యోత్స్నదేవి ఆదివారం తెలిపారు. తెలుగు, ఇంగ్లిషు, గణితం, ఫిజిక్స్, సోషల్, బయాలజీ సబ్జెక్టుల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీ, డిగ్రీ, బీఎడ్ విద్యార్హత ఉండాలని తెలిపారు. విద్యాలయం జూనియర్ కాలేజీలో తెలుగు, ఇంగ్లిషు, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టుల అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తులను తోటకూరపాలెం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో అందజేయాలని సూచించారు.



కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోత్స్నదేవి

పర్యాటక వెలుగులు



జలపాతం వద్ద పర్యాటకుల కోలాహలం

- టూరిజం అభివృద్ధికి వినూత్న ప్రణాళికలు
- అన్ని పర్యాటక స్థలాల్లో ప్రాజెక్టులు వచ్చేలా సమాలోచనలు
- త్వరలో పెట్టుబడిదారులతో సమావేశం
- 100 గజాల నుంచి 40 ఎకరాల వరకూ ప్రాజెక్టులకు రూపకల్పన
- పీపీపీ విధానంలో ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రణాళికలు

సాక్షి, విశాఖపట్నం: ప్రకృతి అందాలతో అలరారే విశాఖ పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు సరికొత్త ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఒకవైపు సాగర సోయగాలు.. మరోవైపు ఎత్తయిన తూర్పు కనుమల అందాలు ప్రపంచ పర్యాటకులను కట్టిపడేస్తుండగా.. ప్రపంచ పర్యాటక పటంలో టూరిజం రాజధానిగా భాసిల్లేలా ప్రాజెక్టులకు ప్రణాళికలు రచిస్తోంది. దేశీ, విదేశీ పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్న విశాఖలో ఉన్న టూరిజం స్థలాలను వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. అన్ని వర్గాల పర్యాటకులను మరింత ఆకర్షించేందుకు ప్రత్యేకమైన థీమ్ టూరిజంలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రూరల్ టూరిజం, హెరిటేజ్ టూరిజం, బుద్ధిస్ట్ టూరిజం, ఎకో టూరిజం, బీచ్ అండ్ వాటర్ టూరిజం, రిక్రియేషన్ అండ్ అడ్వెంచర్ టూరిజం, రిలీజియస్ టూరిజం, క్యూజిన్ టూరిజం, వెల్‌నెస్ టూరిజం, ఎంఐసీఈ టూరిజం, మెడికల్ టూరిజం.. ఇలా అనేక విభాగాల్లో కొత్త ప్రాజెక్టులకు ప్రణాళికలు తయారు చేస్తోంది.

పర్యాటక స్థలాల్లో ప్రపంచ స్థాయి ప్రాజెక్టులు


పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం టూరిజం శాఖకు సంబంధించిన అన్ని భూముల్ని వెలుగులోకి తీసుకురావాలని నిర్ణయించారు. జిల్లాలో పర్యాటక శాఖకు మొత్తం 656.43 ఎకరాలుండగా.. ఇందులో 120.41 ఎకరాల్లో ఇప్పటికే పలు ప్రాజెక్టులున్నాయి. మరో 60.51 ఎకరాలు వివిధ సంస్థలకు టూరిజం ప్రాజెక్టుల కోసం కేటాయించారు. మిగిలిన 475.51 ఎకరాల్లో ప్రతి స్థలాన్ని వినియోగించుకోవాలని భావిస్తున్నారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద పర్యాటక భూములు 15, 20, 33 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వనున్నారు. వీటిల్లో అత్యధికంగా రెస్టారెంట్లు, రిసార్టులు ఏర్పాటు కానున్నాయి. త్వరలో పెట్టుబడిదారులతో సమావేశం ఏర్పాటు చేసి.. 100 గజాల నుంచి 40 ఎకరాల వరకూ ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నారు.

సాగర తీరంలో సరికొత్త ప్రపంచం

సువిశాల సాగర తీరంలో వాటర్ స్పోర్ట్స్, బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే కయాకింగ్, స్పీడ్ బోట్స్, స్కూబా డైవింగ్ వంటి జలక్రీడలతో కళకళలాడుతున్న తీరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది. వాటర్ స్పోర్ట్స్, వాటర్ రైడ్, సెయిలింగ్ ఫెసిలిటీ, అడ్వెంచర్ సర్వీస్, ఏరో స్పోర్ట్స్ మొదలైన వాటితో కూడిన వాటర్ ఫ్లీట్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. 2020–25 టూరిజం పాలసీకి అనుగుణంగా అన్ని రకాల రాయితీలు అందిస్తూ జలక్రీడలకు కేంద్రంగా మార్చబోతున్నారు.

సాహస క్రీడలకు స్వాగతం

ప్రకృతి అందాలకు నిలయంగా.. అంతర్జాతీయ టూరిస్టుల్ని ఆకర్షిస్తున్న విశాఖ మన్యం అడ్వెంచర్ టూరిజంకు కేంద్రంగా మారనుంది. అరకు, లంబసింగి, తాటిపూడి రిజర్వాయర్ ప్రాంతాల్ని అడ్వెంచర్ టూరిజం కోసం ఎంపిక చేశారు. ఇక్కడ జిప్‌లైనర్, ట్రెకింగ్, హిల్‌క్లైంబింగ్‌తోపాటు అనేక సాహస క్రీడలకు నిలయంగా మన్యం ప్రాంతం ప్రసిద్ధి చెందేలా ప్రాజెక్టు సిద్ధం కానుంది. సుజనకోటలోని మత్స్యగెడ్డను బ్యాక్‌వాటర్ టూరిజంగానూ, అడ్వెంచర్ టూరిజంగానూ ఐటీడీఏ సహకారంతో అభివృద్ధి చేయనున్నారు.



అరకులోయలో వలిసె పూల అందాలు

పర్యాటకులను ఆకట్టుకునేలా కొత్త ప్రాజెక్టులు



సరికొత్త పర్యాటకాన్ని విశాఖ వచ్చే టూరిస్టులకు పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇప్పటికే అన్నవరంలో దిగ్గజ సంస్థ ఒబెరాయ్ తమ ప్రాజెక్టు ప్రారంభించేందుకు సీఎంతో చర్చలు జరిపింది. వివిధ సంస్థలు విశాఖలో తమ పర్యాటక వ్యాపార ప్రస్థానాన్ని ప్రారంభించేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. టూరిజం ఎండీ కన్నబాబు సూచనల మేరకు త్వరలోనే పెట్టుబడిదారులతో రోడ్‌షో ఏర్పాటు చేసి.. ఏయే ప్రాజెక్టులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారో తెలుసుకొని దానికనుగుణంగా రోడ్‌మ్యాప్ తయారు చేసుకుంటాం. టూరిజం పాలసీ ప్రకారం వచ్చే సంస్థలకు స్థలాల లీజులు, అద్దెల్లో రాయితీలు, 100 శాతం స్టాంప్ డ్యూటీ, ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్, 5 ఏళ్ల పాటు యూనిట్‌కు రూ.2 మాత్రమే విద్యుత్ చార్జీలు మొదలైన అనేక సౌకర్యాలు అందించనున్నాం.

– శ్రీనివాస్ పాణి, రీజనల్ డైరెక్టర్, పర్యాటక శాఖ

ఉత్సాహంగా.. ఉల్లాసంగా


జలతరంగిణి జలపాతం వద్ద పర్యాటకులు


కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

మారేడుమిల్లి/జి.మాడుగుల: సహజసిద్ధ అందాలకు జిల్లా పెట్టింది పేరు. గిరులన్నీ పచ్చదనంతో అలరారుతుంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో కొండలపై పరుచుకునే మంచుదుప్పటి సందర్శకులకు ఆహ్లాదం పంచుతుంది. ఎత్తైన కొండలపై నుంచి జాలువారుతున్న జలపాతాలు కట్టిపడేస్తాయి. ఆదివారం సెలవు దినం కావడంతో జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలకు సందర్శకులు పోటెత్తారు.

మారేడుమిల్లి మండలంలోని జలతరంగిణి, అమృతధార, దుంపవలస జలపాతాల వద్ద సందర్శకులు సందడి చేశారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ సెల్ఫీలు దిగారు. పాములేరు, జంగిల్ స్టార్, వ్యూ పాయింట్స్, తదితర ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడాయి. జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. టూరిస్టు బస్సులు, కార్లు, జీపులతో జలపాతానికి వచ్చారు. ఇక్కడ గంటల తరబడి జలకాలాడారు. రోజంతా సందర్శకులు ఉల్లాసంగా... ఉత్సాహంగా..గడిపారు.


జలకాలాడుతున్న సందర్శకులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మండలంలోని 25 గ్రామాలకు రోడ్లు
- శివారు గ్రామాల్లో అభివృద్ధి పనులు
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


వంకరాయి గ్రామంలో తారురోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు విశేష కృషి చేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. పెదబయలు మండలం మారుమూల గోమంగి పంచాయతీలో ఆయన ఆదివారం పర్యటించారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా వన్నాడ నుంచి వంకరాయి, సంపంగుల బంద మీదుగా పంగలం వరకు ఎస్‌సీపీ నిధులు రూ.1.95కోట్లతో 4.01 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గతంలో వంకరాయి గ్రామంలో రాత్రి బస చేశామని, అప్పట్లో గ్రామస్తులకు ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు మంజూరు చేయించినట్టు చెప్పారు. శంకస్థాపన కార్యక్రమం పాల్గొవడం ఆనందంగా ఉందన్నారు. కొద్ది నెలల్లో రోడ్డు పూర్తి చేసి, ప్రారంభోత్సవ కార్యక్రమానికి మళ్లీ వస్తానన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. మండలంలో 75 ఏళ్లగా రోడ్డుకు నోచుకోని 25 గ్రామాల్లో తారురోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అత్యంత మారుమూల జామిగుడ, ఇంజరి, గిన్నెలకోట పంచాయతీలకు రోడ్డు నిర్మాణం జరుగుతుందని కొద్ది రోజుల్లో పూర్తవుతుందన్నారు. శివారు గ్రామాల్లో సైతం రహదారులు, తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లోని గెడ్డలపై వంతెనలు మంజూరైనట్టు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమల్లోకి తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా, సకాలంలో అందజేస్తున్నామన్నారు. అరకు నియోజకవర్గంలో అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు స్పష్టం చేశారు. గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.

పెదకోడాపల్లిలో పీహెచ్‌సీ మంజూరు చేస్తాం

మండలంలోని పెడకోడాపల్లి, కుంతుర్ల, కిముడుపల్లి పంచాయతీల ప్రజల సౌకర్యార్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేస్తామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. దీంతో ఆయా పంచాయతీలతో పాటుగా పాడేరు మండలంలోని పలు గ్రామాల ప్రజలకు వైద్యం మరింత చేరువవుతుందన్నారు. బంగ్రోత్‌పుట్టు నుంచి కుంతుర్ల వరకు రూ.2 కోట్లతో తారురోడ్డు పనులు ప్రారంభించాలని ఇంజినీర్లకు సూచించారు. అనంతరం రైతులకు రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు.ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భాగంగా గోమంగి గ్రామ పంచాయతీ నాయకులు, వంకరాయి గ్రామస్తులు ఎమ్మెల్యే పాల్గుణను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. పెద్ద ఎత్తున ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ ఎస్.శ్రీనివాస్, ఈఈ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.బి.ఎస్.నంద్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ సన్యాసి, డీఈఈ సుబ్బారావు, ఏఈలు రాములు, ధ్రువకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు, సర్పంచ్ కొర్రా జెట్టో, ఎంపీటీసీ సభ్యురాలు రాములమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేష్‌కుమార్, మాజీ జెడ్పీటీసీలు గంగాభవాని, సూర్యనారాయణ, నాయకులు సూరయ్య, కనకరాజు, సింహాచలం, సత్యబాబు, ఏవో శ్రీనివాస్, గ్రామ సచివాలయం సిబ్బంది, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం

- గోతులు పడ్డ రోడ్లకు మరమ్మతు పనులు


ప్రధానరహదారిపై గోతులు పూడుస్తున్న పోలీసులు

రాజవొమ్మంగి: జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గోతులు పడ్డ రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. జడ్డంగి నుంచి వైకుంఠపురం వరకు గల రహదారిపై పడ్డ గోతుల్లో కంకర, సిమ్మెంట్ కలిపిన మిక్చర్‌ను వేసి పూడ్చారు. గత రెండు రోజులుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

కొంతమంది స్థానికుల సహకారాలతో ఈ పనులు చేపడుతున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. పీసీ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో పాలిథిన్ కవర్లకు స్వస్తి

- భక్తులకు అందుబాటులో ప్లాస్టిక్ బుట్టలు


మోదకొండమ్మ ఆలయం ప్రాంగణంలోని దుకాణంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ బుట్టలు

సాక్షి,పాడేరు : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి స్వస్తి పలికారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు కొబ్బరి కాయలు, అరటిపండ్లు, అగరబత్తిలు తదితర సామగ్రిని ప్లాస్టిక్ కవర్లతో వచ్చి పూజలు నిర్వహించుకునేవారు. అయితే పాలిథిన్ కవర్లను నిషేధించిన నేపథ్యంలో ఆలయం ఆవరణలో పూజా సామగ్రి విక్రయాల దుకాణాల్లో ప్లాస్టిక్ బుట్టలను అందుబాటులో తెచ్చారు. భక్తులకు ప్లాస్టిక్ బుట్టలలో పూజా సామగ్రిని అందించనున్నారు. అమ్మవారికి పూజా అనంతరం వాటిని తిరిగి సేకరించినున్నారు. పాలిథిన్ కవర్లు అరికట్టేందుకు చేపడుతున్న చర్యల్లో భాగమని ఆలయ కమిటీ దుకాణాదారులు తెలిపారు. దీనిపై భక్తులంతా హర్షిస్తున్నారు.

నల్లకుంటను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- రోటరీ క్లబ్ ప్రతినిధులు


గిరిజనులకు దుప్పట్లు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఎటపాక: నల్లకుంట గ్రామ పంచాయతీని మోడల్ విలేజిగా తీర్చిదిద్దేందుకు తమ వంతు సహకారం అందిస్తామని రోటరీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. నల్లకుంటగ్రామస్తులకు రోటరీ క్లబ్, సైనిక్ క్లబ్‌ల సహకారంతో దుప్పట్లు అందజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. గ్రామంలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, గ్రామానికి అంబులెన్స్ సమకూర్చుతామన్నారు. గ్రామంలో సౌకర్యాలు మెరుగుపర్చడమే కాకుండా స్థానికులకు అన్ని విధాల అండగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం రాములమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత, సొసైటీ చైర్మన్ ఆకుల వెంకట రామారావు, డాక్టర్ పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కాలేజి చైర్మన్ వి.వరలక్ష్మి, కార్యదర్శి జకరయ్య, కోశాధికారి విక్టోరియా, ఉప సర్పంచ్ గుండి కోటి, తెల్లం నవీన్, కోడూరి సాంబశివరావు, ఉబ్బా సత్యం, కొప్పుల వెంకటేశ్వరావు, నవీన్ తదితరులున్నారు.

ఒమ్మవరంలో కొనసాగుతున్న పోలీసు బందోబస్తు


గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

రావికమతం : ఒమ్మవరం గ్రామంలో పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. ఆ గ్రామంలో రహదారి విషయమై తలెత్తిన వివాదంలో రాజునాయుడనే యువకుడు ఆ గ్రామ సర్పంచ్ తోట సంజీబుపై కత్తితో దాడి చేసి గాయాలపాల్జేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ గ్రామంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా కొత్తకోట సీఐ సైయ్యద్ ఇలియాస్ మహమ్మద్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్పంచ్ సంజీబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రేమ్‌చంద్

చింతపల్లి : మండంలోని పెదపాకలుకు చెందిన గిరిజన యువకుడు ఆదివారం ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. వ్యక్తిగత కారణాల వల్ల 30 పేరాసెటమాల్ మాత్రలు మింగడంతో ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో 108 వాహనంలో చింతపల్లి ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు డిప్యూటీ సివిల్‌సర్జన్ మహేశ్వరరావు తెలిపారు.

వరి నాట్లు ఓవైపు.. భద్రత మరోవైపు..


పాడేరు కొండ ప్రాంతంలో ఆంధ్రా– ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో వరి నాట్లు జోరందుకున్నాయి. సరిహద్దు ప్రాంతం కావడంతో భద్రతా సిబ్బంది పొలం గట్లపై నిరంతర పహారా కాస్తున్నారు.

ఫోటో : సాక్షి ఫొటోగ్రాఫర్

విస్తారంగా బొబ్బర్లు సాగు


బొబ్బర్లు పంట

దుంబ్రిగుడ: మండలంలోని కంద్రుం, తూటంగి ,కితలంగి, కింజేరు, కొర్రాయి, కొర్రా, రంగిలిసింగి తదితర పంచాయతీల్లో విస్తారంగా బొబ్బర్ల పంటను పండిస్తున్నారు. నియోజకవర్గంలోని దుంబ్రిగుడ మండలంలోని పండించే బొబ్బర్లను ఎక్కువగా సంతల్లో విక్రయిస్తుంటారు. ఏజెన్సీలో పండించే బొబ్బర్లకు మైదాన ప్రాంతాల్లో గిరాకీ ఎక్కువ. మండల వ్యాప్తంగా సుమారు 300 ఎకరాల్లో బొబ్బర్లు సాగు చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి నీలవేణి చెప్పారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో పంట చేతికొచ్చింది. మార్కెట్‌లో విక్రయాలు జరుగుతున్నాయి. గతేడాది బొబ్బర్లు కిలో రూ.25 నుంచి రూ.30 వరకు ధర పలికిందని, ప్రస్తుతం కిలో రూ.27 ఉందని, మరింత పెరిగే అవకాశముందని రైతులు చెబుతున్నారు.

పాన్‌షాప్‌లోకి దూసుకెళ్లిన టిప్పర్


బైక్ పైనుంచి పాన్‌షాప్‌లోకి దూసుకెళ్లిన టిప్పర్

తుమ్మపాల : అనకాపల్లి మండలం రేబాక జంక్షన్‌లో పెనుప్రమాదం తప్పింది. అనకాపల్లి నుంచి సబ్బవరం వైపు రాంగ్‌రూట్‌లో భారీ లోడ్‌తో వస్తున్న టిప్పర్ రేబాక జంక్షన్ అండర్‌బ్రిడ్జ్ వద్ద అదుపు తప్పి కోట సత్యనారాయణకు చెందిన పాన్‌షాప్‌లోకి దూసుకెళ్ళింది. పాన్‌షాప్ ముందున ఉన్న బైక్‌ను కూడా ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి చిన్నపాటి గాయాలతో తప్పించుకున్నాడు. రాంగ్‌రూట్‌లో వేగంగా వస్తున్న టిప్పర్‌కు రేబాక అండర్‌బ్రిడ్జ్‌లో నుంచి కారు అడ్డంగా రావడంతో డ్రైవర్ భారీ లోడుతో ఉన్న టిప్పర్‌ను అదుపు చేయలేక పాన్‌షాప్ వైపు మరలించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన చోట జంక్షన్ కావడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం నిత్యం అక్కడే వేచి ఉంటారు. ఆదివారం కావడంతో అక్కడ ఎవరూ లేక పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ అనకాపల్లి–ఆనందపురం రోడ్డు విస్తరణ కాంట్రాక్ట్ సంరస్థ డీబీఎల్ కంపెనీకి చెందినది. డీబీఎల్ కంపెనీకి చెందిన టిప్పర్‌లు పరిమితికి మించి భారీ లోడ్‌లతో రాంగ్‌రూట్‌లో వేగంగా రాకపోకలు చేస్తున్నాయి. రేబాక అండర్ బ్రిడ్జ్ వద్ద సరీ్వసు రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహన ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయి.

వంద కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు


తాళ్లపాలెంలో పోలీసులకు పట్టుబడిన గంజాయి, నిందితులు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం కూడలి వద్ద వంద కిలోల గంజాయి పట్టుకొని ముగ్గురు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం అర్ధరాత్రి దాటాక తాళ్లపాలెంలో వాహనాలు తనిఖీ చేయగా కారులో గంజాయి పట్టుబడిందన్నారు. సుమారు వంద కిలోలు ఉన్న గంజాయిని ఏజెన్సీ నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గంజాయి తీసుకెళుతున్న హైదరాబాద్‌కు చెందిన ఫిరోజ్‌ఖాన్, మహ్మద్ ఉస్మాన్ ఖాన్, సురేంద్రలను అరెస్టు చేసి, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కొండవాగులో పడి యువకుడు మృతి


రమేష్ దొర మృతదేహం

మారేడుమిల్లి : కొండవాగు దాటుతుండగా ప్రమాదవశాత్తూ వాగులో పడి ఓ గిరిజన యువకుడు మృతి చెందాడు. శనివారం రాత్రి చోటు చేసుకున్న ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. మారేడుమిల్లి గ్రామానికి చెందిన మడి రమేష్ దొర (32) సీఎస్‌ఐ చర్చి సమీపంలో కొండవాగుకు అవతల కుటుంబంతో నివాసం ఉంటున్నారు. స్థానిక సెంటర్‌కు పనిమీద వచ్చి తిరిగి రాత్రి సమయంలో తన ఇంటికి వెళ్లే తరుణంలో వాగు దాటుతుండగా వాగులో పడిపోయి మృతి చెందాడు. ఆదివారం ఉదయం తల్లి తన కొడుకు ఇంకా ఇంటికి రాకపోవడంతో అతని కోసం వెతుకుతుండగా వాగులో పడి ఉన్న మృతదేహాన్ని గమనించింది. బంధువులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రాము సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుట్కా విక్రేత అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు

యలమంచిలి : గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను ఆదివారం యలమంచిలి రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనకాపల్లి నుంచి ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డుకు గుట్కాను ఆటోలో తరలిస్తుండగా యలమంచిలి గాజువాక బైపాస్ రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తున్న కట్టుపాలెం వద్ద రూరల్ పోలీసులు గుర్తించారు. ప్లాస్టిక్ గోనె సంచులలో ప్యాక్ చేసి వున్న సుమారు రూ.34,650 విలువచేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితుడు కాండ్రేగుల రాంబాబుని అదుపులోకి తీసుకున్నారు. ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు విలేకరులకు తెలిపారు.

పురుగు మందు తాగి గిరిజనుడు మృతి

రావికమతం : పురుగు మందు తాగి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ అజేయపురం గ్రామానికి చెందిన వంతల చిరంజీవి(38) ఆదివారం మృతి చెందాడు. తరచూ మద్యం సేవించే చిరంజీవికి ఆరోగ్యం బాగలేకపోవడంతో మనస్తాపంతో శనివారం రాత్రి పురుగు మందు సేవించాడు. చికిత్స నిమిత్తం ఆతని బంధువులు నర్సీపట్నం ఆస్పత్రికి అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కాగా అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడని చిరంజీవి కుటుంబీకులు తెలిపారు.

క్లుప్తంగా

నేడు రాయపల్లిలో 'గడప గడపకు'

అడ్డతీగల: అడ్డతీగల మండలం రాయపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని మూడు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ అడ్డతీగల మండల కన్వీనర్, జెడ్పీటీసీ సభ్యుడు మద్దాల వీర్రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి వంగలమడుగు, వెదుళ్లకొండ, చిన్నవడిశకర్ర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరు, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొవాలని కోరారు.

ఆకట్టుకున్న డ్యాన్స్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న డ్యాన్సర్లు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని వినాయక చవితి సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఉదయ్‌కుమార్, గణపతిరాజు, రవికుమార్ ఆధ్వర్యంలోని డాన్స్ పోటీలు నిర్వహించారు. పోటీలకు పెద్ద ఎత్తున డాన్సర్లు పాల్గొని ప్రతిభ కనబరిచారు. పోటీల్లో జూనియర్స్ విభాగంలో చాందిని, సీనియర్స్‌లో అర్జున్ గ్రూపు మొదటి బహుమతి గెలుచుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మారావు, పెదబాబు, ప్రసాద్, ఏపీ జెన్‌కో అధికారి నీలకంఠం బహుమతులు అందజేశారు.

సంఘం అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఉమాశంకర్‌నాయుడు

ఎటపాక: లక్ష్మీపురంలో కాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. మున్నూరుకాపు సంఘం డివిజన్ అధ్యక్షులు ఆకెశెట్టి ఉమాశంకర్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సహకారంతో సంఘాభివృద్ధి సాధ్యమన్నారు. విలీన మండలాల మున్నూరుకాపులను బీసీ–డీ కేటగిరీ చేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి నిర్ణయం హర్షణీయమన్నారు. సేవాభావంతో సంఘాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఉమాశంకర్‌నాయుడును ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, శివాజీ, ఈశ్వర్, గిరి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా శాఖాధికారుల నియామకం హర్షణీయం

రంపచోడవరం: ఏజెన్సీలో ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖాధికారి, డిప్యూటీ డీఈఓ పోస్టుల భర్తీకై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయమని ఆదివాసీ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బోండ్లవర ప్రసాదరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ హెచ్‌ఎంలకు పదోన్నతలు కల్పించాలని కోరారు.

అగ్ని ప్రమాద స్థలం పరిశీలన



అగ్నిప్రమాదంలో దగ్ధమైన సామగ్రిని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అరకులోయ: పట్టణంలోని పాతపోస్టాఫీసు కాలనీలో శనివారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు చిరంజీవి కుటుంబాన్ని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సూచనల మేరకు పీఏసీఎస్ చైర్మన్ శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్, శెట్టి అప్పాలు, నర్సింగ్, బాలరాజు తదితరులు ఆదివారం పరామర్శించారు. ప్రమాదంలో దగ్ధమైన సామగ్రిని పరిశీలించి, సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో సుమారు రూ.3లక్షల ఆస్తినష్టం జరిగినట్టు విచారం వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

హెల్త్ ఎమర్జెన్సీకి డిమాండ్



మాట్లాడుతున్న సీతారాం

ఎటపాక: గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో విషజ్వరాలు ప్రబలుతుండడంతో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. ఎర్రబోరు గ్రామంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. నేతలు కిరణ్, నాగేశ్వరరావు, రామారావు, సత్యనారాయణ, వెంకట్ తదితరులున్నారు.

నోరూరించే బేంబూ రుచులు

- బెంబూ చికెన్, బిర్యానీలకు డిమాండ్
- స్థానిక గిరిజనులకు ఉపాధి



మంటపై కాల్చుతున్న బెంబూ చికెన్



చవులూరించే వంటకం సిద్ధం

అరకులోయ రూరల్: ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకులోయలో పర్యాటకులకు ప్రకృతి అందాలు ఒకవైపు ఆకట్టుకుంటే... మరోవైపు ఇక్కడ లభించే ప్రత్యేక వంటకాలు నోరూరిస్తున్నాయి.. ప్రముఖ పర్యటక కేంద్రంగా పేరొందిన అరకులోయలో బెంబూ చికెన్, బెంబో బిర్యానీకు ఒక్క ప్రత్యేకత ఉంది. ఇక్కడి సందర్శిత ప్రాంతాలను తిలకించేందుకు వస్తున్న పర్యాటకులకు బెంబూ (వెదురు) తయారీ రుచుల ఘుమఘుమలతో నోరూరిస్తోంది. దీంతో స్థానికులు ఆదాయ వనరులుగా ఈ వ్యాపారంపై మరింత మొగ్గుచూపిస్తున్నారు. బెంబూతో తయారీ చేసిన వంటకాలపై పర్యాటకులతో పాటు స్థానికుల అభిరుచి రోజు రోజుకు పెరుగుతోంది. సాధారణంగా చేసిన చికెన్, బిర్యానీకి విభిన్నంగా వెదురు బొంగలో చేసిన ఆయా వంటకాలకు ప్రత్యేక రుచి ఉండడంతో వీటికి మరింత డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం కిలో బెంబూ చికెన్ రూ.700 నుంచి సీజన్ బట్టి రూ.900లకు, బెంబో బిర్యానీ కిలో రూ.1400 నుంచి రూ.1700 వరకు విక్రయిస్తున్నారు. ఒకప్పుడు మండల కేంద్రంలోని ఒకటి, రెండుచోట్ల బెంబో చికెన్ స్టాళ్లు దర్శనమిచ్చేవి. ప్రస్తుతం గాలికొండ వ్యూపాయింట్, కాఫీ తోటలు, గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్స్, అరకు సంతబయలు, డుంబ్రిగుడలో చాపరాయి, కటిక జలపాతం, బొర్రాగుహలు తదితర ప్రాంతాల్లో సుమారు 100కు పైగా స్టాళ్లు దర్శనమిస్తున్నాయి. ఆయా స్టాళ్ల ద్వారా నిరుద్యోగ గిరిజన యువత స్వయం ఉపాధి పొందుతున్నారు.

తయారీ విధానం

మన్యంలో ప్రత్యేకంగా లభించే లేత వెదురు గొట్టాలను సేకరించి వాటిని సైజులుగా నరికి, నీటితో బాగా శుభ్రం చేస్తారు. అనంతరం చికెన్‌ను బాగా శుభ్రం చేసి తగినంత మసాలాను (అవసరమైనే నూనె) కలుపుతారు. అనంతరం ఏజెన్సీలో లభించే అడ్డాకుల్లో వాటిని చుట్టి, గొట్టాల్లో కూర్చి రెండు వైపులా ఆకులతో మూసివేస్తారు. వాటిని మంటపై సుమారు 20 నిమిషాలు కాల్చుతారు. అనంతరం తయారైన చికెన్, బిర్యానీను అమ్మకానికి సిద్ధం చేస్తారు.

రుచి అదుర్స్

మన్యంలో లభించే బెంబూ (వెదురు)తో తయారుచేసిన చికెన్, బిర్యాని రుచులు అదుర్స్ అని పర్యాటకులు చెబుతున్నారు. నూనె, ఇతరత్రా ధినుసులు లేకుండా చేసే ఈ వంటకం మరింత రుచికరమని భోజనప్రియులు అభివర్ణిస్తున్నారు. మన్యంలో బెంబోతో తయారు చేసిన వంటకాలను ఒక్కసారి రుచి చూడాల్సిందేనని చెబుతున్నారు. ఆవిరిపై తయారైన ఈ వంటకం వల్ల అన్ని పోషకవిలువలు అందుతాయని, రుచికరంగా ఉంటుందని పలువురు చెబుతున్నారు.

చిరు వ్యాపారంతో స్వయం ఉపాధి



బెంబూ చికెన్, బిర్యానీ అమ్మకాలతో స్వయం ఉపాధి పొందుతున్నాం. పర్యాటకులు ఎక్కువ మంది వస్తే వ్యాపారం బాగుంటుంది. సీజన్‌లో వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణ సాగుతుంది. వేసవికాలం, వర్షాకాలంలో పర్యాటకుల సంఖ్య తగ్గడంతో వ్యాపారం అంతంతమాత్రంగా ఉంటుంది. పర్యాటక ప్రాంతాల్లో ఏజెన్సీలో లభించే అటవీ ఉత్పత్తులతో పాటు ఇలాంటి ప్రత్యేక రుచికరమైన వంటకాలు విక్రయించే స్టాళ్లు ఏర్పాటుచేస్తే మరింత మందికి ఉపాధి లభిస్తుంది.
– దేవి, చిరు వ్యాపారి, అరకులోయ మండలం

పాస్టర్ల ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గ సభ్యులు

అరకులోయ: నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించి పాస్టర్ల ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. పాస్టర్ల ఫెలోషిప్ గౌరవాధ్యక్షుడిగా సీనియర్ పాస్టర్ కొర్రా జాన్ ప్రకాష్, అధ్యక్షుడిగా హుకుంపేటకు మోజేష్, కార్యదర్శిగా అరకులోయ చెందిన శెట్టి బాబురావు, కోశాధికారిగా డుంబ్రిగుడకు చెందిన తిమోతి, ఉపాధ్యక్షులుగా ప్రభుదాస్, టీవీఆర్ జోషెప్, వైకుంతం, మోహన్, కృష్టోదాస్, సంయుక్త కార్యదర్శులుగా యెహెస్కెల్, సునీల్ పాల్, జేమ్స్, తిమోతి, కార్యవర్గ సభ్యులుగా శామ్యూల్, సుదర్శన్, ప్రసాద్, డేవిడ్‌రాజు ఎన్నికయ్యారు. నియోజకవర్గంలోని క్రైస్తవ సంఘాల కార్యక్రమాలతో పాటు సమస్యల పరిష్కారానికి తమ కార్యవర్గం పనిచేస్తుందనిఅధ్యక్షుడు మోజేష్ చెప్పారు.

ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల పంపిణీ



పోడు పట్టాలు అందజేస్తున్న సర్పంచ్ సుబ్బారావు

డుంబ్రిగుడ: కితలంగి పంచాయతీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బారావు రైతులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొండపోడు భూములపై గిరిజనులకు హక్కు కల్పించడం హర్షణీయమన్నారు. నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ పోడు పట్టాలు అందే విధంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ విశేష కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సుమారు 70 మందికి పట్టాలు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న పోడు పట్టాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు శోభ దేవి, వార్డు సభ్యులు సింహాద్రి, సోనాదోయ్, రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు అర్జున్, జగబందు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు విశేష ఆదరణ



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య. చిత్రంలో సర్పంచ్ పుష్పలత, నాయకుడు రవి

చింతపల్లి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గిరిజనులు ఎంతగానో ఆదరిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి అన్నారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గడిచిన మూడు రోజులుగా లోతుగెడ్డ పంచాయతీలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి విశేష కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపట్ల గిరిజనులు సంతోషంగా ఉన్నారని వారు తెలిపారు.

రైతులకు అండగా ప్రభుత్వం



బంగారుమెట్ట ఆర్‌బీకేలో రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ముంచంగిపుట్టు: రైతును రాజుగా చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని బంగారుమెట్ట రైతు భరోసా కేంద్రంలోని 90 శాతం సబ్సిడీపై గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలను ఎమ్మెల్యే పాల్గుణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువుల పంపణీ చేయడంతో పాటు వ్యవసాయ సామగ్రిని అందజేస్తోందన్నారు. రైతులు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పంటలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయశాఖ అధికారి నందు మాట్లాడుతూ విత్తనశుద్ధి చేసుకుంటే పరుగుల బెడద ఉండదని, మండలంలోని 107 క్వింటాళ్లు ఇండెంట్ పెట్టామని, అర్హత గల రైతులు దరఖాస్తు చేసుకుంటే విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలకు అమలుచేస్తోందన్నారు. ఎంపీపీ సీతమ్మ, సర్పంచ్ రత్నం, ఎంపీటీసీ సభ్యురాలు కొండమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, ఎస్‌ఐ రవీంద్ర, మండల వ్యవసాయ అధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

చింతూరు: తాము ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రొబేషనరీ కాలం ప్రకటించడంతో పాటు వేతనాలు పెంచినందుకు గాను నాలుగు మండలాలకు చెందిన గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది థ్యాంక్యూ సీఎం సార్.. అంటూ కృతజ్ఞత సభ నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చింతూరులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ జిల్లా నాయకులు రమేష్ చెక్క మాట్లాడుతూ సిబ్బంది వేతానాలు పెంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలుపుకున్నారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఏర్పాటైన గ్రామ సచివాలయాల్లో మంచి సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

యూనియన్ డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొడ్డు బలరాం, వైస్ ప్రెసిడెంట్‌గా సున్నం ఎర్రయ్య, కోశాధికారిగా జోడె నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా సోడె ముత్తయ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా పాడియం గౌతంరాజు ఎంపికయ్యారు. కార్యక్రమంలో పండా రఘు, మానె వినోద్, వల్లపు చిన్న, సవలం సునీత, గీతాంజలి, బిందు పాల్గొన్నారు.

టీడీపీ నేతలు అసత్య ప్రచారాలు మానుకోవాలి

కొయ్యూరు: టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల బూత్ కమిటీ కన్వీనర్ పొట్టిక పోతురాజు స్పష్టం చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఆయన అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని స్పష్టం చేశారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో నాయకులు ప్రజల సొమ్మును దోచుకున్నారని, ప్రజలకు తెలుసు అని చెప్పారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ మాధవిలపై గిరిజనులు చూపిస్తున్న అభిమానాన్ని చూసి తట్టుకోలేక టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇకపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఆలయంలో విగ్రహాల ఏర్పాటు



సమావేశంలో పాల్గొన్న సమరసత ఫౌండేషన్, వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ సభ్యులు

గంగవరం : పాత గంగవరం గ్రామంలో నిర్మించిన రామాలయంలో శ్రీ సీతారాముల రాతి విగ్రహాలు ఏర్పాటుకు వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్ ప్రతినిధులు అంగీకరించినట్టు సమరసత ఫౌండేషన్ మండల కన్వీనర్ కత్రం చిన్నాలరావు చెప్పారు. స్థానిక పాత గంగవరంలోని రామాలయంలో ఆలయ కమిటీ సభ్యులతో సమర సత ఫౌండేషన్ , వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీ సీతారాముల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరడంతో వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ ప్రతినిధులు రాతి విగ్రహాలు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. సభ్యులు విశ్వరరెడ్డి, అబ్బాయిరెడ్డ, ప్రచారక్ సీహెచ్.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నసమారాధన



అన్నసమారాధనలో భక్తులు

సాక్షి, పాడేరు: స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయంలో భక్తులకు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అమ్మవారి దర్శనానికి స్థానికులతో పాటు మైదాన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు అన్నదానం నిర్వహించిన దాత దేముడుకు ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడులు అభినందించారు. ఎస్‌బీఐ మేనేజర్ శేషుబాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు శివరాత్రి శ్రీనివాస్, ముకుంద, నాగు, సిద్దనాతి కొండలరావు, తదితరులున్నారు.

పశువైద్య శిబిరాల ఏర్పాటుకు చర్యలు

డుంబ్రిగుడ: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్టు వైద్యాధికారులు గౌతమ్, రాజశ్రీ చెప్పారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పశువులకు వ్యాక్సిన్లు వేయడంతో పాటు పశువ్యాధులపై రైతులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. పశువులకు ఎటువంటి వ్యాధులు సంభవించినా సిబ్బందికి తెలియజేయాలన్నారు.

నిమజ్జన ఉత్సవాల్లో జాగ్రత్తలు పాటించాలి



వినాయక మండపం కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న సీఐ దేముడుబాబు, ఎస్‌ఐలు

అరకులోయ: యండపల్లివలస ప్రాంతాల్లోని గణేష్ మండపాలను సీఐ జి.దేముడుబాబు ఆదివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నవరాత్రి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. నిమజ్జన కార్యక్రమాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎటువంటి సమస్యలున్నా 9440904226, 9440904225 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఎస్‌ఐలు సంతోష్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి



అడపవలసలో ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు

డుంబ్రిగుడ: సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక పోవడంతో ఇబ్బందులు ఎదురుర్కోంటున్నారని గిరిజన సంఘం నాయకుడు సూర్యనారాయణ చెప్పారు. ఆదివారం తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఖాళీ బిందెలతో గ్రామస్తులు నిరసన తెలిపారు. గ్రామంలో బోరు పాడవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బోరు మరమ్మతు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



సింహాద్రిపాలెంలో గిరిజనులకు మందులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

వై.రామవరం: మండలంలోని సింహాద్రిపాలెం గ్రామంలో సీపీఐ ఎమ్‌ఎల్ లిబరేషన్, ఆంధ్రప్రదేశ్ జన సాంస్కృతిక మండలి, నార్మల్ బెతూన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్, సూర్య, కొట్నీస్ ప్రజా వైద్యశాలల, డాక్టర్ చిన్నబల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భగా సత్యనారాయణ, లిబరేషన్ జిల్లా కార్యదర్శి గణేశ్వరరావు, జనసాంస్కృతిక మండలి జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు మాట్లాడుతూ శిబిరంలో 203 మందికి వైద్య పరీక్షలు చేసి, మాస్కులు, మందులు పంపిణీ చేశామన్నారు. రోగులకు మల్టీవిటమిన్ డ్రింకులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేసినట్టు చెప్పారు. దుస్తులు, చెప్పులు, స్టీల్ సామగ్రి పంపిణీ చేశామన్నారు. పల్లాల శ్రీను, శామ్యూల్, రాజు, సత్తిబాబు, గోవిందు, నాగమణి, కుశల, సూరిరెడ్డి రమాదేవి, బాబీ పాల్గొన్నారు.

మారేడుమిల్లి: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి మందిరం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. రాజమహేంద్రవరంకి చెందిన వైద్యులు జి.రామారావు, నిఖిత, కృష్ణతేజ, నీలిమలు రోగులకు పరీక్షలు చేశారన్నారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం వైద్యులు కంటి పరీక్షలు చేశారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం

పెదబయలు/డుంబ్రిగుడ/హుకుంపేట/జి.మాడుగుల/కొయ్యూరు/చింతపల్లి రూరల్/గంగవరం/రాజవొమ్మంగి: అల్లూరి జిల్లాలోని పలు మండలాల్లో గణేష్ నిమజ్జనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. గణనాథుని విగ్రహాలను డప్పు, వాయిద్యాల నడుమ భారీగా ఊరేగించారు. యువత నృత్యాలతో సందడి చేశారు. శక్తి వేషాలు ఆకట్టుకున్నాయి. బాణా సంచా కాల్చారు. పెదబయలులో జరిగిన లడ్డూ వేలంపాటలో రూ.5500లకు స్థానికుడు ప్రవీణ్‌కుమార్ దక్కించుకున్నారు. పలుచోట్ల భారీ అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు.



చింతపల్లిలో గ్రామస్తుల సందడి





డుంబ్రిగుడ, గంగవరాలలో గణనాథుల నిమజ్జన ఊరేగింపులో గ్రామస్తులు



జి.మాడుగులలో శక్తి వేషధారణ





రాజవొమ్మంగి, హుకుంపేట ప్రాంతాల్లో ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు